క్లుప్తంగా

17న గుంటూరు జిల్లా చరిత్ర సంఘ వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా చరిత్ర సంఘ 29వ వార్షికోత్సవ సభను ఆదివారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎస్. శామ్యూల్, డాక్టర్ మంచాల బోసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళ మెత్తుదామా' పుస్తకావిష్కరణతో పాటు మంతెన వెంకటరాజు స్మారకోపన్యాసం, విద్యావ్యవస్థలో చరిత్ర-మార్పులు, వ్యాఖ్యానాలు, భారత రాజ్యాంగం-లౌకికవాదంపై చర్చా కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

19న వృక్షశాస్త్ర విభాగ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల విశ్రాంత వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్. రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 19న వృక్షశాస్త్రంలో అంతర్ కళాశాలల క్విజ్, వక్తృత్వ, డిజిటల్ పోస్టర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోటీలకు హాజరు కావచ్చునని, విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 16లోపు తమ పేర్లను వాట్సాప్ ద్వారా నమోదు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 94407 12410 నంబర్లో కన్వీనర్ డాక్టర్ జి. రమేష్‌ను సంప్రదించాలని సూచించారు.

జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి మృతి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల ఫోరెన్సిక్ వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి (58) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విద్యానగర్‌లో ఇంట్లో ఉన్న సమయంలో గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. డాక్టర్ కృష్ణమూర్తి మృతదేహాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

కనుల పండువగా కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్ల వేంకటేశ్వరాలయంలో కమిటీ ఆధ్వర్యంలో దశావతార కల్యాణ మహోత్సవాలు గురువారం కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామివారు వరాహావతార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి కల్యాణ మహోత్సవం జరిపారు. స్వామివారి తీర్థ ప్రసాదం భక్తులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో కిట్స్ విద్యార్థికి గోల్డ్‌మెడల్



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సృజన్ సిన్హా ఫెన్సింగ్ క్రీడలో బంగారు పతకాన్ని సాధించాడు. జేఎస్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో సిన్హా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి, బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. ఆ సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో చైర్మన్ సృజన్ సిన్హాను అభినందించారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ఔరంగాబాద్‌లోని ఎంజీఎం యూనివర్సిటీలో జరగనున్న అంతర్జాతీయ విశ్వవిద్యాలయ పోటీల్లో కూడా సిన్హా పాల్గొననున్నాడని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, క్రీడాచార్యులు కె.వెంకట్రావు, సీహెచ్ విశ్వనాథ్ సాయిలను చైర్మన్ ప్రశంసించారు.

స్వాములకు చద్ది వితరణ

గుంటూరు రూరల్: దేవుని సన్నిధిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని గోరంట్ల గ్రామంలోని దేవాలయాల కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ తెలిపారు. గ్రామంలోని అభయాంజనేయస్వామి, షిర్డీ సాయినాథుని ఆలయంలో అయ్యప్పలు, స్వాముల చద్ది వితరణ కార్యక్రమం గురువారం కొనసాగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటిదాకా 31 రోజులపాటు స్వాములకు చద్ది వితరణ చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ సుమారు 400-500 మంది స్వాములకు వితరణ చేసినట్లు చెప్పారు. 41 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, మాల ధరించిన ప్రతి స్వామి ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిల్లర శ్రీనివాసరావు, చల్లా నాగరాజు, నల్లగొర్ల శ్రీనివాసరావు, ఉప్పు చిట్టి, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దు

25వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



నవరత్నాల ప్రగతి పత్రాలను ప్రజలకు అందజేస్తున్న వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి ఆధ్వర్యంలో ''బాబు ఆపు నీ నాటకం -జగనన్నే మా నమ్మకం'' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు భక్తనగర్, మహాత్మాగాంధీ నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో 77, 79వ వార్డు సచివాలయాల కన్వీనర్లు మామిడి వెంకటేశ్వర్లు, ఓర్సు ఏడుకొండలు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. అధికారం కోసం చంద్రబాబు ఇస్తున్న హామీల్ని నమ్మి మోసపోవద్దని, సంక్షేమ రథసారథి జగనన్నకే వచ్చే ఎన్నికల్లో తిరిగి పట్టం కట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆయా కార్యక్రమాల ప్రగతి పత్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వలంటీర్లతో పాటు 12, 17 క్లస్టర్ల గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



గడ్డిపాడులో పనులకు శంకుస్థాపన చేస్తున్న నూరిఫాతిమా, నేతలు

పట్నంబజారు: ప్రతి పేదవాడికీ సంక్షేమాన్ని అందజేయాలనే ధ్యేయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. గురువారం 15వ డివిజన్ ఎల్ ఆర్ కాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అజయ్, పార్టీ నేతలు సుధాకర్‌రెడ్డి, మురళి, హనుమాయమ్మ, అంజిరెడ్డి, గోపి, వీరారెడ్డి, శ్రీక్రాంత్, నరసింహారావు, శాంతిరెడ్డి, పెద్దిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడ్డిపాడులో శంకుస్థాపన

తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. 57వ డివిజన్ గడ్డిపాడులోని గణేష్ నగర్‌లో రూ. 50 లక్షల వ్యయంతో మంచినీటి పైపులైను, సీసీ రోడ్లకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ నేతలు నూర్‌ఖాన్ పాల్గొన్నారు.

గర్భిణులు ముహూర్తాల కోసం వేచి ఉండటం ప్రమాదం



మాట్లాడుతున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గర్భిణులు నొప్పులు భరించలేకపోవడం, ముహూర్తల పేరుతో శస్త్ర చికిత్సల కోసం తాపత్రయం పడుతుండటం బాధాకరమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి శుశ్రుత హాలులో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు, బరువు తక్కువ పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాగరికత పెరుగుతున్న సమాజంలో ముహూర్తం పెట్టుకుని పిల్లలకు జన్మనిచ్చేందుకు తల్లులు సిద్ధపడుతుండటం విచారకరమన్నారు. దానివల్ల అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రకృతి పరంగా శిశువు జన్మనిస్తే ఆరోగ్య వంతంగా ఉంటారని చెప్పారు. సాధారణ శస్త్ర చికిత్సల వల్ల శిశువులు ఆరోగ్యంగా పుడతారని, ఈ విషయాన్నీ తల్లిదండ్రులు గమనించాలని ఆయన సూచించారు. నెలలు నిండకుండా శిశువులు జన్మనిస్తే ఆరోగ్యవంతంగా ఉండటం కష్టమని చెప్పారు. వ్యాధులు, వైకల్యంతో బాధపడతారని వెల్లడించారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం చిన్నారులకు వైద్య సేవలు సత్వరంగా అందించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు మాట్లాడుతూ నెలలు నిండిన గర్భిణులు ప్రసవం తర్వాత శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకం



ఆదర్శ్‌కు నియామకపత్రం అందజేస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఎం. ఆదర్శ్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగాన్ని కల్పిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామకపత్రం అందజేశారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగంలో చేరిన అభ్యర్థులు కష్టపడి పని చేయాలని, సీసీఏ నిబంధలు విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ ఏ సెక్షన్ ఏవో హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పాత గుంటూరు: ఏలూరు బజారు శ్రీ కోదండ రామ మందిరం వద్ద శ్రీ వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో 15 నుంచి 17 వరకు సహస్ర కలశ అభిషేకాలు, అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ నాళం శివప్రసాద్ తెలిపారు. వేదిక ప్రాంగణంలో గురువారం ఉత్సవ ఆహ్వాన పత్రిక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో శివప్రసాద్ మాట్లాడుతూ 15న ఉదయం 8:10 నిమిషాలకు అష్ట ద్రవ్య మహాగణపతి హోమం, సాయంత్రం సహస్ర కలశ పూజ, ప్రధాన ఉదయం సహస్ర కలశ అభిషేకాలు, 18 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో స్వామికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు 18 రకాల పూలతో అభిషేకాలు, శ్రీ అయ్యప్ప స్వామి అష్టాదశ మహా పడిపూజ మహోత్సవం ఉంటాయని తెలిపారు. అనంతరం అయ్యప్ప, భవానీలు, భక్తులకు భిక్ష ఉంటుందని చెప్పారు. 17న అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నామని, భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో డి.వి. రవి కుమార్, జుజ్జూరు శ్రీనివాసరావు, దేవతి శివకుమార్, పాదర్తి ఉమామహేశ్వరరావు, ఓం ప్రకాష్, జి. నాగ వెంకట నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ ఆస్తులు పరిరక్షించాలి



లాడ్జి సెంటర్‌లో ఏఈఎల్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యుల ప్రదర్శన

నెహ్రూనగర్: అన్యాక్రాంతమవుతున్న ఏఈఎల్‌సీ ఆస్తుల్ని పరిరక్షించాలని కమిటీ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో టీడీపీ నాయకులు, ప్రైవేటు వ్యక్తుల వల్ల ఏఈఎల్‌సీ ఆస్తులు సగానికి పైగా అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన ఆస్తుల్ని కూడా కాజేసేందుకు కుయుక్తులు పన్నుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు కె. హేబెల్, ఎం. శ్యాంసన్, కె. జయసుధ, టి. జయరత్నం, కె. ఏసుపాదం, నల్లపు నీలాంబరం, పి. శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పట్నంబజారు: ఇసుక వ్యాపారానికి సంబంధించి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి సంఘటన గుంటూరులో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ముఫ్తీ బజార్‌కు చెందిన ముజుబుల్ రెహమాన్, అతని సోదరుడు నౌషాద్‌లు రేపల్లెకు చెందిన సన్నీకి మధ్య మూడు సంవత్సరాల నుంచి ఇసుక వ్యాపారానికి సంబంధించి వివాదం నడుస్తోంది. సన్నీకి నౌషాద్, రెహమాన్ 25 లక్షలు ఇచ్చి, వ్యాపార ఒప్పందం చేసుకున్నారు. అయితే, ఒప్పందానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగకపోవడం, సన్ని గత మూడు సంవత్సరాల నుంచి ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో రెహమాన్ పోలీసుల్ని ఆశ్రయించాడు. అయినప్పటికీ ఎటువంటి పరిష్కారం లేకపోవడం, పోలీసులు పట్టించుకోకపోవడంతో గురువారం నౌషాద్ గుంటూరులోని లాలాపేట పోలీసు స్టేషన్ వద్ద ఎలుకల మందు తిన్నాడు. బంధువులు, స్నేహితులు కలసి కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. దీనిపై లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం.శ్రీనివాసరావును వివరణ కోరగా రెహమాన్‌కు, సన్నికి మధ్య డబ్బులు అంశం సివిల్ అని, దీనిపై ఎటువంటి పోలీసు చర్యలు చేపట్టలేమని తెలిపారు. డబ్బులు అంశానికి సంబంధించి కోర్టులో వివాదం నడుస్తున్నట్లు తెలిసిందని చెప్పారు.

లక్ష్యాలకు దూరంగా 'కాప్' సదస్సు నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్

లక్ష్మీపురం: వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూగోళాన్ని, మానవాళిని కాపాడేందుకు కాప్-28 సదస్సు తీసుకున్న చర్యలు నామమాత్రమేనని యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనిక దేశాల్ని నియంత్రించడంలో ఐక్య రాజ్యసమితి విఫలమవుతున్న తీరుకు వాతావరణ సదస్సు కాప్- 28 ముగిసిన తీరే నిదర్శనమని తెలిపారు. గత నెల 20న దుబాయ్‌లో ప్రారంభమై డిసెంబర్ 13న ముగిసిన ప్రపంచ దేశాల సదస్సు వాతావరణ లక్ష్యాల సాధనకు దూరంగానే మిగిలి పోయిందని విమర్శించారు. ఆచరణాత్మక దిశలో అడుగు ముందుకు వేయడానికి బదులుగా ధనిక దేశాలు తమ అజెండాను పేద దేశాలపై రుద్దటానికే అధిక ప్రాధాన్యత ఇచ్చాయని తెలిపారు. అగ్ర రాజ్యాల తీరును దాదాపు అన్ని పేద దేశాలు విమర్శించాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, పర్యావరణ ఉద్యమకారులు టి.నారపరెడ్డి ప్రసంగించారు.

నేటి నుంచి సహస్ర చండీ యాగ మహోత్సవాలు



సిద్ధమైన యాగశాలలు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక(7) సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహ లక్ష్మీ గణపతి మహాయాగాలు జరిపిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయ చయనులు పర్యవేక్షణలో ఈనెల 15వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి హోమం, చండీపారాయణాలు, అఖండ దీపారాధన, జపాలతో మొదలైన వైదిక క్రతువు 20వ తేదీ బుధవారం మహా మంగళ పూర్ణాహుతి, వంశోద్ధార, యజ్ఞరక్షాధారణ, వేదాశీర్వచనం, ఋత్విక్కులకు సన్మానం, మంగళహారతి, వందన సమర్పణతో ముగుస్తుందని తెలిపారు. ఆరు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ యాగాల్లో భాగంగా ఆరు రోజులు ప్రాతః కాలం, సాయంకాలాల్లో చండీ పారాయణం, చండీ హోమం, వనదుర్గా పారాయణ, వేదపారాయణ, లక్ష్మీగణపతి మహామంత్ర జపానుష్టానాలు, శ్రీ రుద్ర పారాయణాలు, లలితా సహస్ర నామపారాయణలు, సూర్యనమస్కారాలు, అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పోయిన బ్యాగ్‌ను మహిళకు అప్పగించిన పోలీసులు



మహిళకు బ్యాగ్‌ను అప్పగిస్తున్న ఎస్‌ఐ షరీఫ్, ట్రాఫిక్ సిబ్బంది

పట్నంబజారు: బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ట్రాఫిక్ పోలీసులు తిరిగి అప్పజెప్పిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఈస్ట్ ఎస్‌ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... వింజనంపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం గుంటూరు మార్కెట్‌కు వచ్చింది. ముందుగా బ్యాంకుకు వెళ్లి బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి రూ. 2 లక్షల నగదు, కొంత బంగారంతో మార్కెట్‌కు వచ్చి పనులు చూసుకుని ఆటోలో వెళుతుండగా చేతి బ్యాగ్ తెగి కింద పడిపోయింది. గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు విషయాన్ని ఎస్‌ఐ షరీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మహిళ ఆచూకీ గుర్తించిన పోలీసులు ఆ బ్యాగును తిరిగి ఆమెకు అందజేశారు.

సీతారామయ్య స్కూలు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: నంబూరులోని వీవీఐటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలోత్సవంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాళ వాయిద్య పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో రెండో తరగతి విద్యార్థిని ఎన్. లక్ష్మీ సంకీర్తన, సీనియర్స్‌లో 8వ తరగతి విద్యార్థి టి. బోస్ అనుదీప్ కృష్ణ ప్రథమ బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థిని కోడూరి అద్వైత భారతి సంస్కృత శ్లోకాల్ని పఠించడంలో తృతీయ బహుమతి కై వసం చేసుకున్నట్లు వివరించారు. విద్యతో పాటు సంగీత, సాహిత్య కళల్లో మేటిగా రాణించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దిన సంగీత విద్వాంసుడు నెమలి రాంబాబును అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

బాలోత్సవంలో భాష్యం బ్లూమ్స్ ప్రతిభ



వీవీఐటీ బాలోత్సవ్‌లో బహుమతి అందుకుంటున్న హర్షిత్ కల్యాణ్

గుంటూరు ఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రతిభతో రాణిస్తున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. నంబూరులోని వీవీఐటీలో ఈనెల 11,12,13వ తేదీల్లో జరిగిన బాలోత్సవంలో భాగంగా వివిధ పోటీల్లో పాల్గొన్న భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నట్లు గురువారం ఆయన తెలిపారు. చదువుతో పాటు అభిరుచికి అనుగుణంగా వారికి ఆసక్తి గల రంగాల్లో విద్యార్థుల్ని భాష్యం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలోత్సవంలో నిర్వహించిన వాద్య సంగీత పోటీల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థి హర్షిత్ కల్యాణ్ ప్రథమ బహుమతి, వక్తృత్వ పోటీలో శాశ్వత్ ద్వితీయ బహుమతి, యోగానంద శాస్త్రి ప్రోత్సాహక బహుమతి అందుకున్నట్లు వివరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాల్ని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

తైక్వాండో పోటీల్లో కేఎల్పీ స్కూలు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కృష్ణప్రసాద్, రథినీచౌదరి


గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్లో ఈనెల 9న జరిగిన అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ మాట్లాడారు. అండర్-11 విభాగంలో సీహెచ్. పవన్ కల్యాణ్, ఎన్. రిత్విక్, పి. సాయి ప్రణతి బంగారు పతకాలు, టి.కార్తికేయ, ఎన్. రేవంత్, కె. తహసీన్, ఎల్. కార్తిక, ఎస్. లాస్య రజత పతకాలు, డి. లాస్యశ్రీ , షేక్ అహ్మద్ సాజిత్, వెంకట అవినాష్‌రెడ్డి, పి. నయాన్‌ఖాన్ కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. అండర్-14 విభాగంలో వై. భార్గవ్ సాయిధీరజ్ బంగారు పతకం, ఏ, చైత్ర, వి. శ్రీరామ్, వి. ప్రణీత్, షేక్ ఖాజా మొహిద్దీన్ కాంస్య పతకాలు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె. బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ కృష్ణప్రసాద్‌తో పాటు ప్రిన్సిపాల్ వై. రథినీ చౌదరి, ఏవో కె. వెంకట్రావు అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామనామక్షేత్రం సమీపంలో గురువారం ఉదయం భాస్కరరావు, వెంకటశివనాగరాజు 400 కిలోల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని ఇద్దరిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పెదపాలెంలో బజరంగ్ నేత్ర జ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కొరిటెపాడు: దృష్టి లోపం సమస్య మాత్రమే కాదని, మనిషికీ, ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేసే దిశగా భజరంగ ఫౌండేషన్ నేత్ర జ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తున్నట్లు భజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలం, పెదపాలెంలో ఈనెల 13న భజరంగ్ జగన్ నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో అవసరమైన 332 మందికి కళ్లజోళ్లు సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. పెదపాలెంలో శనివారం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కళ్లజోళ్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. బజరంగ్ నేత్ర జ్యోతి శిబిరంలో కళ్ల జోళ్ల అవశ్యకతను గుర్తించబడిన వారు అందుబాటులో ఉండి, వాటిని పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

యూసీమస్‌లో స్టెమ్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ



శ్రీప్రణవిని అభినందిస్తున్న ఫాదర్ భరత్

గుంటూరు ఎడ్యుకేషన్: యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం (యూసీమస్) నిర్వహించిన రాష్ట్రస్థాయి రీజనింగ్ మాథమాటిక్స్ పోటీల్లో స్టెమ్ స్కూల్ 5వ తరగతి విద్యార్థిని శ్రీప్రణవి ద్వితీయ బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ ఫాదర్ భరత్ తెలిపారు. విద్యానగర్‌లోని స్కూల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు డెల్టా కేటగిరీలో ఈనెల 10న గుంటూరు కేంద్రంగా నిర్వహించిన పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 70 పాఠశాలల నుంచి పెద్దసంఖ్యలో పోటీపడిన విద్యార్థుల్లో 90 మంది అర్హత సాధించారని వివరించారు. వారిలో ప్రతిభ చూపి ద్వితీయ బహుమతి కై వసం చేసుకున్న తమ విద్యార్థిని శ్రీప్రణవి ఈనెల 17 నుంచి ముంబైలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. దినపత్రికల్లో ప్రచురించే సుడోకు వంటి మొదడుకు పదునుపెట్టే వాటిని సాధన చేస్తూ, ఆయా పోటీల్లో పాల్గొనడం ద్వారా ఎటువంటి క్లిష్టమైన సమస్యలనైనా ఎదుర్కొని, విజయం సాధించగలిగే స్థాయికి విద్యార్థులు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయశీల, రమాదేవి, మోనిక పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: విద్యుత్ పొదుపుతోనే భవిష్యత్ వెలుగు ఉంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాల ఐఐసీ సహకారంతో రెన్యూవబుల్ ఎనర్జీ క్లబ్ ఆధ్వర్యంలో ఎనర్జీ కన్సర్వేషన్ అండ్ ఇన్నోవేటివ్ పేరుతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, భావితరాలకు భవిష్యత్తును అందించేందుకు కృషిచేయాలన్నారు. జోసిల్ లిమిటెడ్ కంపెనీ ప్రొడక్షన్ అడ్వైజర్ ఆర్.బెనర్జీబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంధన శక్తి ప్రాముఖ్యతను, వాతావరణ మార్పుల్లో దాని ప్రభావాన్ని, భవిష్యత్తులో ఇంధన శక్తి కొరత ఏర్పడకుండా పొదుపు సామర్థ్యం పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలను చేసి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాస్, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ సి.వి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.